# ఎవరయినా చెప్పండి?

## ఉషారాణి భాటియా

"ఏం ఇలా వచ్చావు? రంగమ్మ మళ్ళీ నాగా పెట్టిందా? మాట్లాడవేం?" రెట్టించింది విమల.

గోవిందు తల వొంచుకునే నిలబడి వున్నాడు.

"జ్వరం తగిలిందండీ! ఒళ్ళంతా నొప్పులూ, తలపోటూ. మంచం దిగులేకుండా వుండండీ," గొణిగాడు.

"పని మానెయ్యటానికి, మీకు బోలెడన్ని వంకలు దొరుకుతాయి. ఇప్పుడీ చాకిరీ అంతా ఎవరు చేసేట్టు? ఆయన ఎనిమిదన్నరకల్లా ఇల్లు కదలాలని తెలుసు కదా!"

విమల కొంగుతీసి నడుంకి చుట్టుకుని, అంట్లగిన్నెలముందు కూలబడింది.

"మమ్మీ! చాకలి వచ్చాడు. నాన్న, నల్లపంట్లాము ఎక్కడుందని అడుగుతున్నాడు?" పెద్దకూతురు రత్నం లోపల్నుంచి కేక వేసింది.

"నా తలమీద వుంది! అందరూ యిప్పుడే రావాలీ నా ప్రాణానికి? ఏం! ఆ రేడియో ముందు అలా అంటుకుపోయినట్లు కూర్చోకపోతే లేచి వెళ్ళి యివ్వకూడదూ?" విమల చేతిలో గిన్నెలు ధనధన శబ్దం చేస్తున్నాయి.

గోవిందు మెల్లిగా వచ్చి ఆమె పక్కన నిలబడ్డాడు. "మీరు లేవండమ్మగారూ! నేను తోమిపెడతాను," అన్నాడు మెల్లిగా.

"అవును, తోముతావు! ఆ తరువాత పనంతా నేను మళ్ళీ చేసుకోవాలి! ఇకమీద రంగమ్మ నాగా పెట్టినప్పుడు, మరో మనిషిని కుదర్చకపోతే మీ పనే నాకు వద్దు. ఖచ్చితంగా చెబుతున్నాను. ఈ పూటకి అవసరమైన పని నేనే చేసుకుంటాను. మధ్యాహ్నంనుంచీ మనిషిని పంపు. లేదా వేరే మాట్లాడుకుంటాను."

గోవిందు సమాధానంకోసం చూడకుండా విమల లోపలికి వెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు యింట్లో పెద్ద సర్కసు కార్యక్రమంలా వుంది. విమల భర్త ఆనందరావు తొమ్మిదయినా, యిల్లు కదలలేకపోయాడు. పెద్దవాడు రవి టిఫినుడబ్బా లేకుండానే కాలేజీకి వెళ్ళిపోయాడు. రత్నం, యింకా జాకెట్టు యిస్త్రీ పెడుతూంది. చిన్నకూతురు రమ, బూట్లు పాలిషు కాలేదని మారాం చేస్తూంది.

"ఏమిటీ గోల! పిచ్చెక్కిపోతూంది! చిల్లరదుకాణంలా ఆ రేడియో ఏమిటి అంత వాల్యూమ్! తగ్గించు రత్నం!" అంటూ ఆనందరావు పెద్దగా అరిచాడు.

కాస్సేపు యిల్లంతా నిశ్శబ్ద మయిపోయింది.

"సాయంత్రం ఆలశ్యం కావొచ్చు! పనుంది." అని భార్యకి చెప్పి, అతను ఆఫీసు కారు ఎక్కాడు.

విమలకి ముచ్చెమటలు పోస్తున్నాయి. పనులు ఎంత త్వరగా ముగించాలని తాపత్రయపడుతుంటే అంత ఆలస్యం జరుగుతూ వుంది. ఆమె తలంతా రేగివుంది. చేతిలోంచి గరిటెలు కిందికి జారిపోతున్నాయి. ఉల్లిపాయ తొక్కలూ, బీన్సు గింజలూ పాదాలకింద నలుగుతూ, వంటిల్లు భీభత్సంగా వుంది.

సలభై పడిలోకి వచ్చిన విమలకి వంట రాదని కాదు – చాలా బాగా వచ్చు. కానీ వంటమనిషి సుఖం ఎరిగాక, అలవాటు తప్పింది. వారంక్రితమే వంటామె శెలవు తీసుకుంది – జీతం తీసుకునిపోయే తొందరకూడా లేకుండా చేసిన నిష్క్రమణ అది. దానికితోడు ఇవాళ రంగమ్మకూడా నాగా పెట్టింది.

తెల్లని విమల చెంపలమీదుగా నీళ్ళు కారిపోతున్నాయి. విసుగుతో కనుబొమలు ముడిపడ్డాయి. చిన్న చప్పుడుకే తల బ్రద్దలయిపోతూంది.

తను బి. ఏ. మొదటి సంవత్సరంలో వున్నప్పుడు కామోసు – ఇంటికి బోలెడంత మంది చుట్టాలొచ్చి, తను ఓరోజు వంటింట్లోకి వెళ్ళవలసివచ్చింది. కూరలు తరగటం మొదలుపెట్టిందో లేదో ఒడిన కత్తి. అక్కయ్య గిన్నె తన చేతిలోంచి లాక్కుని, బైటికి తరిమివేశారు. ఆ గారాబం, తన పెళ్ళియాకకూడా, యింతింతై పెరిగిందే కానీ, తగ్గలేదు. డబ్బుకీ, హోదాకీ తక్కువ లేని ఆనందరావు, తనకి వంటింటి కష్టం ఏమిటో తెలియనిచ్చాడేకాదు. పైపెచ్చు, ఈ బొంబాయి వచ్చాక, భర్తతో పార్టీలకి వెళ్ళటం అదీ, తనకసలు తీరుబడే లేకుండాపోయింది. అన్నట్లు, ఇవాళ కుంకర్నిగారింట్లో బర్త్‌పార్టీ కదూ!... విమల క్యాలెండరుకోసం ముందుగదిలోకి వెళ్ళింది.

అక్కడ పెద్దకూతురు రత్నం, చిన్నది రమ ఏదో వాదులాడుకుంటున్నారు. సగం యింగ్లీషు, సగం తెలుగులో చెల్లెల్ని తిడుతూంది రత్నం.

"నా పెన్ను నాకిచ్చెయ్యి! లేకపోతే డాడీతో చెబుతాను." రత్నం చెల్లెలి మీదిమీదికి వెళుతూంది.




"అదేమిటే? చిన్నది! ఒకవేళ పెన్ను తీసినా, అలా దెబ్బలాడుతారుటే?"

వారించింది తల్లి.

"అదికాదు మమ్మీ! నా ఫ్రెండు ప్రెజంటు యిచ్చిన పెన్ను అది."

"నో! నో! నే నసలు ముట్టుకోనేలేదు. నా గౌనుపైన పెడితే, అది లాగుతున్నపుడు ఓమాటు కిందపడింది. ఆ తరువాత నే నసలు చూడనేలేదు;" రమ గొంతు హెచ్చించింది.




"అబ్బో! ఏం వాదన! నాతల్లి లాయరు కావలసిందే!" వ్యవహారమంతా నవ్వుల్లోకి దింపి, కూతురు బుజం తట్టింది తల్లి.

"మమ్మీ! అదంతా నాకు తెలియదు. కేంబ్రిడ్జి సీనియరు అయాక నేను ఫారిన్ వెళ్ళవలసిందే;" గోముగా తల్లిమీద వాలింది రమ.

"అలా గేలే! నాబంగారు తల్లులుకదూ! త్వరగా తెమలండి మరి!" కూతుళ్ళని ఆక్కున చేర్చుకుంది విమల...

* * *

ఇంతలో కూళాయిదగ్గిర చిన్న చప్పుడయింది. విమల పిల్లల్ని వదిలి, పెరట్లోకి చూసింది.

పధ్నాలుగేళ్ళు వుంటాయి. నన్నగా. బాగా పొంకగ్గావుంది. ముదురాకు పావడా, ఓణీ, నల్లరెవికా, బిగించిన జడచివర్న ఎర్ర వూలూ, మెళ్ళో పూసలదండా, నల్ల ముఖానికి పెద్ద కాటుకకళ్ళూ, చాదుబొట్టూ_ దారితప్పిన ఓ లేడిపిల్లని జ్ఞప్తికి తెస్తున్నాయి ఆపిల్లచూపులు. తెలిసీతెలియని పరిచయంతో నవ్వుతున్నాయి బుగ్గన సొట్టలు. చేతుల పట్టుగాజులు సర్దుకుంటూ, విమల పలకరింపు కోసం ఎదురు చూస్తోంది ఆపిల్ల.

''ఏంకావాలి?'! అడిగింది విమల.

"నాయన పంపారు. ఈపూట పని చేసి పోతాను. ఏం చెయ్యాలండీ?"

''నువ్వు రంగమ్మ కూతురివా?'' విమల ఆపిల్లని పరిశీలనగా చూసింది.

"అవునండీ! నేను రెండోదాన్ని. ఓ అన్న వున్నాడు. లారీలు తుడుస్తుంటాడు. నా తరువాత వల్లి, అలివేలు, గుంటడు..." బొటనవ్రేలు నేలకి రాస్తూ, లక్ష్మి చెప్పుకుపోతూంది.

"సర్లే! ముందు ఆ అంట్లు తోము. బాగా తోమాలి సుమా! ఒక్కరవ్వ జిడ్డు కూడా వుండకూడదు." విమల లోపలికి వెళ్ళిపోయింది.

లక్ష్మి పావడా సర్దుకుని, కుళాయిదగ్గిర కూర్చుంది. అంట్లగిన్నెలు దగ్గిరకి జరుపుకుంటూ, లోపలికి తొంగిచూసింది. రత్నం, రమ స్కూలుకి తయా రవుతున్నారు. వాళ్ళ బట్టలూ, చేతిలో పుస్తకాలూ కళ్ళు పెద్దవిచేసుకు చూస్తోంది లక్ష్మి. గిన్నెల మీంచి చేతులు తీసేసి లేచి నిలబడింది.

"ఎంత బాగున్నారో యిద్దరూ! ముఖాలకి ఏం మెరుపు! ఆ జుత్తు అలా పాయలు చేసి కడితే అందం కామోసు! బళ్ళోకి వెళ్ళాలంటే అంత బరువు చెప్పలే అవ్వ!" బుగ్గలు నొక్కుకుంది లక్ష్మి.

"ఏమిటే! అలా నిలబడ్డావ్! ముందు పని కానీ!" పెరట్లోకి వచ్చిన విమల కేక వేసింది.

"చిన్నమ్మాయిలు చదువుకోవటానికాండీ వెళుతున్నారు?'' లక్ష్మి నిలబడే అడిగింది.

''అవును. ఏం?'' అన్నది విమల.

''బంగారుబొమ్మల్లా గున్నారండీ! మళ్ళీ ఎప్పుడు తిరిగొస్తారండీ?''

"సాయంత్రంలే! ఖబుర్లకేం గానీ పని తెములు్చ.''

లక్ష్మి పీచు చేతిలోకి తీసుకుంది. ఆ పిల్ల చేతులు గిన్నెల్ని తోముతున్నాయిగానీ, మన సెక్కడికో పోయింది.

తనూ మొదట్నుంచీ. బడికి వెళుతూ

వుంటే ఈపాటికి ఈ తెల్లఅమ్మాయిల్లాగా పుస్తకాలు పట్టుకుని బడికి వెళుతూవుండేదా? పొట్టిచేతుల చొక్కా, అలాటి పావడా వేసుకుంటే తను ఎలా వుంటుంది? లక్ష్మికెందుకో సిగ్గు ముంచుకొచ్చింది. పైట సరిచేసుకుంది. తోమిన గిన్నెలు ఒక్కొక్కటే పక్కన పెడుతూంది. దొడ్డివాకిట్లోంచి ఓ కుక్క లోపలికి రాబోయింది. లక్ష్మి చట్టుక్కున లేచి వెళ్ళి తలుపు గడియ బెట్టింది.

ఈమాటు లక్ష్మి పాదాలు అంట్లగిన్నెల వైపు కాక, యింటిలోపలికి దారితీశాయి. గోడవారగా నిలబడి, వంటిట్లో స్టీలు గిన్నెలూ, హాల్లో ఫ్రిజిడ్ ఏయిరూ, సోఫాలూ ఆశ్చర్యంతో చూస్తోంది. ఆ పిల్ల కళ్ళు జిగేలుమన్నాయి. 'అమ్మగారు తనని యిల్లంతా తుడవనిస్తే, ఎంచక్కా ఒక్కో సామాను దగ్గిరగా చూడవచ్చు–' అని ముచ్చటపడింది మనసు. కానీ లోపల ఆవిడ గొంతు వినపడగానే, భయపడుతూ, వెనక్కి నక్కింది.

'ప్చ! పాడుభయం! భయమే తనని ఎందుకూ పనికిరాకుండా చేసింది! తన కప్పుడు ఆరేళ్ళు వుంటాయి. పట్నంనుంచి పెద్దమామయ్య వచ్చి వెంట రమ్మని పిలిచాడు. బళ్ళో వేయిస్తాననీ, మంచిబట్టలు కుట్టిస్తాననీ ఎంతో ఆశ చూపాడు. కానీ తనే అమ్మని పట్టుకు భోరున ఏడిచింది. నాయన మెడ చుట్టేసుకుని గోల చేసింది. బుర్రమీసాలూ, చేతిలో కర్రా– మామ తన ప్రాణానికి యముడే ఆ రోజుల్లో! అప్పుడు బుద్ధిగా వెళ్ళివుంటే, తనకి చదువు వచ్చేదా! తన దగ్గిర నుంచిబట్టలూ, పుస్తకాలూ వుండేవా!

ఆ విషయం తలుచుకుంటేనే, లక్ష్మికి చాలా గుబులుగా వుంది. అవును, తను చదువుకునేది– తలలో రంగు రిబ్బనూ, కాళ్ళకి చెప్పులూ, చంకలో సంచీ, మధ్యాహ్నం అన్నానికి చిన్న డబ్బా– రాత్రి లాంతరు పెట్టుకు చదువుకోవటం– మబ్బులు పట్టిన లక్ష్మి మనసు ఓ క్షణం ఆనందంతో విచ్చుకుంది.

మొదట్లో చిన్న పుస్తకాలే అయినా తరువాత పెద్దవి చేతిలో పట్టుకు వెళుతుంది. ఆ తరువాత? ఆ పిల్లకళ్లు మెరుస్తున్నాయి. ఆసుపత్రిలో డాక్టరమ్మలాగా తనూ ఓ తెల్లచీర కట్టుకుని, అందరికీ మందులు పంచిపెడుతుంది. లేదా, బడిలో పెద్దక్కయ్యలాగా, కుర్చీలో కూర్చుని చదువు చెబుతుంది. లేదా రోజూ రిక్షాలో కనపడే లలితమ్మగారిలా, పువ్వులచీర కట్టుకుని, గొడుగు పట్టుకుని పనిలోకి పోతుంది. కానీ అమ్మలాగా, అంట్లు తోముకుంటూ, పిల్లల్ని చూసుకుంటూ వుండదు. ఇవన్నీ పట్టపగలే లక్ష్మి ఊహాప్రపంచంలో తిరిగే దృశ్యాలు.



తల్లితో సంతకి వెళుతుంటే సరి తోవలో గుంపులుగుంపులుగా అమ్మాయిల కనిపించేవాళ్ళు. అమ్మ కొంగు పట్టుక లాగుతూ వాళ్ళని చూపించేది.

"అమ్మా! నేనూ వెళతానే? నన్న బడికి తీసికెళ్ళవే?''

తను అలా బ్రతిమాలని రోజులేద కానీ తల్లి ఎప్పుడూ తనమాట వినిపిం కునేదికాదు. నాయన మటుకు నవ్వి వూ కునేవాడు. చెల్లెలూ, తరువాత మర చెల్లెలూ, తమ్ముడూ–యిలా గుడిసె నిం పోయి, తను యిక అలా అడిగే సం ర్భమే లేకుండాపోయింది. కానీ తన మ సులో కోరికమటుకు పూర్తిగా ఆరిపోలేద

ఇతర్లని చూసినప్పుడు ఆ కోరిక మ

ఎక్కువయి, తన కళ్ళవెంట నీళ్ళుకూడా వచ్చేవి. ఇవాళకూడా తనకళ్ళు ఏమిటో ఇసుకపడినట్లు మండుతున్నాయి. లక్ష్మి కొంగు తీసుకుని ముఖమంతా తుడుచుకుంది.

*　　*　　*

"ఈ గోదవార ఏం చేస్తున్నావే? అంట్లు తోమటానికి వచ్చి నా యింటి వాసాలు లెక్కపెడుతున్నావా? అమ్మో! ఆ కిటికీలోనించి ఏదైనా అందుతుందేమో ననేనా ఈ ప్రయత్నం! పద ... ముందు బైటకి పద."

వెనుకనుంచి వచ్చిన విమల మాటలు విని లక్ష్మి కట్టెలా నిలబడిపోయింది. విమల తనరెక్క పుచ్చుకోగానే, పాము తగిలినట్లు, విదిలించుకుంది.

"నేను దొంగను కానండమ్మగారూ. మీ యింట్లో వున్నలాటి వస్తువులు ఇంతకు క్రితం చూసిఎరుగను. అందుకే ఇక్కడ నిలబడి చూస్తున్నాను."

ప్రాధేయపడుతున్నట్లు చేతులు నలుపుకుంది లక్ష్మి.

"ఈ నాటకమంతా నాకు అనుభవమేలే! ముందు యింటికి పోయి, మీ నాయనని పంపు. పోనీ పాపం అని చోటిస్తే నెత్తికెక్కుతారు పాడుజాతి," అంటూ విమల లక్ష్మిని బైటికి నెట్టి, వెనుకతలుపు ధభీమని మూసింది.

*　　*　　*

ఇక అక్కడ నిలబడీ ప్రయోజనంలేదు అనిపించింది లక్ష్మికి. నిండుకుంటున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ, ఇంటిముఖం పట్టింది. అడుగులు లెక్కపెడుతూందే గానీ కోపంతో చాలా బాధపడుతూంది మనసు.

*　　*　　*

నులకమంచం వేసుకుని, గుడిసెబైటే కూర్చునివుంది రంగమ్మ. పక్కనే పీటమీద యిద్దరుకొత్తవ్యక్తులు కూర్చునున్నారు. దగ్గిరగా వెళ్ళాక, పెద్దమామయ్యని గుర్తు



పట్టింది లక్ష్మి. పక్కన ఎవరిదో కొత్త ముఖం. తలవొంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

మోకాళ్ళమీద తల అనించి ఓ మూలగా కూర్చుంది. లోపలికి వచ్చిన తల్లిని చూడగానే గొల్లున ఏడవటం ప్రారంభించింది. తల్లినడుం వాటేసుకుంటూ, జరిగినదంతా, వెక్కిళ్ళతో చెప్పింది.

"పోనీలే! పాడు మనుషులు! అంటే అన్నారులే. రేపు నే వెళ్ళి మాట్లాడతాగా!" ఓదార్చింది తల్లి.

"వెనుకపక్క కుండలో కాసిన నీళ్ళు తీసి ముఖం కడుక్కునిరా. బావ వచ్చాడు చూశావా?" లక్ష్మి గడ్డం పైకెత్తి ఆప్యాయంగా చూసింది తల్లి.

"ఎవరు?"

అడిగింది లక్ష్మి పరాకుగా.

"అయ్యో రామ! ఇంకా చిన్నపిల్లవిటే? నీ మొగుడొచ్చాడే! నీ మొగుడు!" రంగమ్మ గట్టిగా నవ్వింది.

లక్ష్మి అదిరిపడినట్లు బైటికిచూసింది నీలం షర్టూ, గోధుమరంగు నిక్కరూ, పొడిగా చిన్న క్రాపూ, మెడచుట్టూ గళ్ళరుమాలూ - నిండా ఇరవై సంవత్సరాలు లేవు అతనికి. గుడిసెలోకి కుతూహలంగా చూస్తున్నాడు. "ఈ దరిద్రురాలి కడుపున పుట్టావుగానీ, ఎంత అదృష్టమే నీకు? నిన్ను చేసుకుంటామని మామయ్య స్వయానా చెప్పటానికి వచ్చాడు. బావకి సైకిలుషాపులో పనిచే, అదేదో ఆరోదివరకూ చదివాడట. నా తల్లిని బంగారుపువ్వుల్లో పెట్టి చూసుకుంటాడులే!" రంగమ్మ కూతుర్ని ముద్దాడి, మెటికలు విరిచింది.

*　　*　　*

ఇప్పుడు కళ్ళు తడిగా లేవు. పెదిమలు చలనం కోల్పోలేదు. ఎంతో నిశ్చలంగా అయింది ముఖం. తలకి రంగురిబ్బనూ, చేతిలో పుస్తకాలసంచీ, మోసుకుని వడివడిగా తను బడికి వెళుతున్న దృశ్యం - ఆ పిల్ల హృదయంలో ఏమూలో బలంగా గుచ్చుకున్నట్లయింది. "ఇదంతా ఎందుకిలా అయింది? కారణం ఏమిటి? ఎవరన్నా చెప్పండి?" అంటూ తల్లిమీద వాలిపోయింది లక్ష్మి.

———